# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 21 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## యోగా డేను విజయవంతం చేయాలి

- మంత్రి దామోదర రాజనర్సింహ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

యోగా డే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో శనివారం నిర్వహించనున్న 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగా' కార్యక్రమ నిర్వహణపై తెలంగాణ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయుష్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆయుష్ శాఖకు చెందిన యోగా శిక్షకులు, మెడికోలు, వివిధ పాఠశాలలకు చెందిన 5500 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, మేయర్ విజయలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. యోగ కార్యక్రమం లో పాల్గొనే వారందరికీ ఉదయం అల్పాహారం ను అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగ కార్యక్రమం లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రులు శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, మేయర్ విజయలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

## హైదరాబాద్ చుట్టుపక్కల వేగంగా అభివృద్ధి



- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చుట్టుపక్కల వేగంగా అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. అందులో భాగంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపాలిటీలను సందర్శిస్తున్నట్టు చెప్పారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డితోపాటు సంబంధిత శాఖల సెక్రటరీలతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఇటీవల ఓఆర్ఆర్ అవతలి వైపు కొన్ని గ్రామాలు, ఓఆర్ఆర్ పక్కన గల గ్రామాలు జీహెచ్ఎంసీలో విలీనమైనందున ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏ మేరకు అభివృద్ధి చెందుతున్నాయో సమీక్షిస్తున్నట్టు చెప్పారు. తాగునీటి సౌకర్యంపై జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన కాలనీలలో పైప్‌లైన్లు వేయాలని, అందుకు సంబంధించి అంచనాలు వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత లేకుండా కావాల్సిన నిధులను గ్రామపంచాయతీలకు, మున్సిపాలిటీలకు విడుదల చేస్తున్నట్టు వివరించారు. పన్ను వసూళ్లలో ఈ సంవత్సరం 23 శాతం అతి తక్కువగా చేయడంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అసంతృప్తి వ్యక్తం చేశారు. లక్ష్యాలను అధిగమించాలని, కొత్త ఇండ్ల అసెస్‌మెంట్‌లను చేయించి, మున్సిపాలిటీల ఆదాయం పెంచాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలో విద్యుత్ దీపాలు, వార్డుల్లో నాలాల శుభ్రత తదితర అంశాల్లో తగిన ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా పని చేయాలని అధికారులకు సీఎస్ సూచించారు. అనంతరం కోత్వాల్‌గూడాలో నిర్మాణంలో ఉన్న హెచ్ఎండీఏ ఎకో పార్కును, రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. సీఎస్ వెంట రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇలంబర్తి, హెచ్ఎండీఏ సెక్రెటరీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, పీడీ హౌసింగ్ నాయక్, తహసీల్దార్ రవీందర్‌దత్, కమిషనర్ సుమన్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఏపీ సీఎంతో చర్చలకు సిద్ధం

- బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చర్చలు జరుపుతాం
- మేము వివాదాలు కోరుకోవడం లేదు
- 23న ఏపీతో చర్చలపై రాష్ట్ర క్యాబినెట్‌లో చర్చిస్తాం
- కోర్టుకు వెళ్లడం కంటే ముందే చర్చించుకోవడం ఉత్తమం
- వివాద పరిష్కారానికి కాలపరిమితి లేదు
- ఏపీకి గోదావరి జలాలను మామా, అల్లుళ్లే రాసిచ్చారు
- కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలం
- జులై 6,7 తేదీల్లో మళ్లీ ఢిల్లీకి వస్తాం
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. తాము ఎవరితోనూ వివాదాలు కోరుకోవడం లేదని.. అయితే తెలంగాణ హక్కులను మాత్రం వదులుకునే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం తొలుత తెలంగాణను సంప్రదించకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రాథమిక సాధ్యసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్) సమర్పించడమే ప్రస్తుత వివాదానికి మూలకారణమని రేవంత్ రెడ్డి అన్నారు. పీఎఫ్ఆర్ ఇచ్చే ముందే మాతో చర్చించి ఉంటే ఈ వివాదం ఉండేది కాదు.. కేంద్రానికి ఏపీ నివేదిక ఇవ్వగానే, కేంద్రం కూడా అన్ని రకాల చర్యలకు సిద్ధమవుతోందని అన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు తమకు ఎలాంటి బేషజాలు లేవని, ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై మాట్లాడుకుందామని ఆయన సూచించారు. ఒక రోజు కాదు, అవసరమైతే నాలుగు రోజులైనా చర్చిద్దాం.. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయన్నారు.

ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుందని.. ఈ భేటీలో బనకచర్ల అంశంపై సమగ్రంగా చర్చించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్‌ను అధికారికంగా చర్చలకు ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. "ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం.. తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదని ఆయన అన్నారు. విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు ఇప్పటికే అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసిందని ఆరోపించారు. నీళ్లు, నిధుల పేరిట బీఆర్ఎస్ నేతలు మోసపూరిత సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకున్నారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని కేసీఆర్ అన్నారు. గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని కూడా గతంలో వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీశ్ రావులే" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తాను కృష్ణా జలాల్లో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్ఓసీ అడిగితే మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుపడుతున్నారని, ఆయన వాదనలో పసలేదని అన్నారు. 2023లో కేంద్రానికి హరీశ్ రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు. విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. దీనిపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. గోదావరిలో 968 టీఎంసీలు వాడుకునే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కానీ, కేటాయించిన నీటిని వాడుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదాలు తలెత్తుతున్నాయి" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాద పరిష్కారానికి ఎలాంటి కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. అలాగే.. జూలై 6, 7 తేదీల్లో మరోసారి ఢిల్లీలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు.

## ఆర్జేడీ-కాంగ్రెస్‌కు బీహార్‌కు వ్యతిరేకం



- ప్రధాని మోడీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం సివాన్ జిల్లా జసోలి పట్టణంలో బహిరంగ సభలో ప్రసంగిస్తూ ఆర్జేడీ-కాంగ్రెస్ పార్టీలు బీహార్‌కు వ్యతిరేకమని, పెట్టుబడులకు ప్రతికూలమని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆర్జేడీ-కాంగ్రెస్ పార్టీలు మాఫియా రాజ్, గూండా రాజ్, అవినీతి సంరక్షకులు" అని విమర్శించారు. ప్రధాని మోడీ ఈ సందర్భంగా సివాన్‌లో రూ. 5,900 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి, పట్నా పటలిపుత్ర రైల్వే స్టేషన్లో నుంచి గోరఖ్‌పూర్ వరకు వందే భారత్ రైలు ప్రారంభం చేశారు. మొత్తంగా బీహార్‌లో రూ. 9,500 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇది 2025లో బీహార్‌కు మోడీ నాల్గవ పర్యటన కావడం గమనార్హం. అక్టోబర్-నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

గత దశాబ్దంలో నాలుగు కోట్ల మందికి పక్కా ఇళ్లు అందించామని, రాబోయే రోజుల్లో మరో మూడు కోట్ల ఇళ్లు ఇవ్వనున్నట్లు మోడీ తెలిపారు. "ఇప్పటికీ మోడీ విశ్రాంతి తీసుకోడు. బీహార్‌లో పేదలు, దళితులు, మహాదళితులు, అత్యంత వెనుకబడిన వర్గాలు, ఇతర వెనుకబడిన వర్గాల అభ్యున్నతే నా లక్ష్యం," అని పేర్కొన్నారు. "మా ప్రభుత్వమే పేదలకు ఉచిత రేషన్, కరెంట్, నీరు ఇస్తోంది. కానీ చేతి (కాంగ్రెస్) మరియు లాంతరు (ఆర్జేడీ) గుర్తులు గలవారు దేశాన్ని దోచుకుందికి ప్రయత్నించారు, ఇప్పటికీ అవకాశాల కోసం చూస్తున్నారు," అని విమర్శలు గుప్పించారు.


### భారత ప్రగతిపై ప్రపంచ నాయకుల ప్రశంస

తాజా విదేశీ పర్యటనల్లో ప్రపంచ నేతలు భారత వేగవంతమైన అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయారని మోడీ చెప్పారు. "భారతదేశం త్వరలో మూడో శక్తివంతమైన దేశంగా ఎదుగుతుంది. ఆ ప్రగతిలో బీహార్ కీలక పాత్ర పోషిస్తుంది," అన్నారు. "పేదరికాన్ని నిర్మూలించవచ్చని ఎన్డీయే ప్రభుత్వం చూపించింది. గత పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికాన్ని ఓడించారు. వారిలో 3.75 కోట్ల మంది బీహార్ నుంచే" అని తెలిపారు.

### ఆర్జేడీపై మోడీ ఘాటుగా

"బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ఆర్జేడీ నేతలు అవమానిస్తారు. కానీ నాకు బాబా సాహెబ్ గుండెల్లో ఉన్నారు," అని మోడీ అన్నారు. "వారికి (ఆర్జేడీ, కాంగ్రెస్) 'పరివార్ కా సాథ్, పరివార్ కా వికాస్'బీ మనకు 'సబ్కా సాథ్, సబ్కా వికాస్'" అని అన్నారు.

## పెట్టుబడులకు సమర్థవంతమైన వేదిక తెలంగాణ




- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణ పెట్టుబడులకు, పారదర్శక పాలనకు, సమర్థవంతమైన మానవ వనరులకు వేదిక అవుతుంది. ప్రతి రూపాయి సీఎస్ఆర్ నిధి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికే ఖర్చు కావాలి. అభివృద్ధి ఫలితాలు కంపెనీ ఆఫీసుల్లోనే కాక పాఠశాలల్లోని చిన్నారుల నుంచి రైతు కుటుంబాలకు, గ్రామీణ కళాకారులకు అందాలి" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అభివృద్ధికి కొత్త నిర్వచనం తెలంగాణ అని, పెట్టుబడులకు సరైన వేదిక హైదరాబాద్ అని అన్నారు. ఆర్థిక అభివృద్ధితో పాటు మానవీయ కోణాన్ని జోడిస్తూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి ఓ కొత్త నిర్వచనాన్ని రచిస్తుందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాదు మైండ్‌స్పేస్‌లోని ద వెస్టిన్ హోటల్‌లో అసోచామ్ సదరన్ కౌన్సిల్ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై డిప్యూటీ సీఎం భట్టి ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ బాధ్యతలతో కూడిన తెలంగాణను నిర్మించేందుకు యావత్ క్యాబినెట్ కట్టుబడి పని చేస్తోందన్నారు. మనం ఇప్పుడు అపార వనరులు ఉన్నా కానీ అసమానతల ప్రపంచంలోనే జీవిస్తున్నామన్నారు. ఇప్పటికే " ట్రికిల్ డౌన్ " ఆర్థిక వ్యవస్థలు పనిచేయలేవని స్పష్టం అయ్యిందన్నారు. ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం పునాదిపై నిలవాలన్నది కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం అని, తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఆ సిద్ధాంతానికి కట్టుబడి పని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తల చర్యలు దానం కోసం కాకుండా బాధ్యత కోసం అనుకోండని, మీ పని ప్రశంసల కోసం కాదు సామాజిక మార్పు కోసం అని భావించాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. మనందరి ప్రయత్నం సంస్థల నిర్మాణం కోసం మాత్రమే కాకుండా సమాజాల శ్రేయస్సు కోసం కూడా పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కార్పొరేట్ సంస్థలు సీఎస్?ఆర్? నిధులు ఖర్చు చేసేందుకు తెలంగాణ రాష్ట్రం సరైన వేదిక అన్నారు. ఈ రాష్ట్రంలో వారు అనుకున్న లక్ష్యాలను నూటికి నూరు శాతం నెరవేర్చడమే కాదు, ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేసేందుకు అవకాశం ఉందని అన్నారు.

దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అనువైన ప్రాంతం అన్నారు. ఇక్కడ అనుకూలమైన, అందరికీ సరిపోయే వాతావరణం ఉందని, ఎక్కడా భాషా సమస్య లేదన్నారు. అంతే కాకుండా శాంతిభద్రతలు, తక్కువ ధరకు పుష్కలంగా లభించే మానవ వనరులు, అన్నిటికీ మించి ఫ్రెండ్లీ గవర్నమెంట్ ఇక్కడ ఉందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఈ దేశంలోని రాష్ట్రాలతో కాదు అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతుందని అన్నారు. హెల్త్, ఫార్మా, ఐటీ, ఫుడ్ గ్రెన్స్ వంటి రంగాల్లో తెలంగాణ ది తిరుగులేని ప్రస్థానం అని భట్టి విక్రమార్క అన్నారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో పేద విద్యార్థులకు విద్యను అందించాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అని ఆయన తెలిపారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల క్యాంపస్‌లో రూ. 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నామన్నారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున 100 పాఠశాలలు మంజూరు చేశామని, పాఠశాలలను కట్టించడం కాదు, వాటిని నిర్వహించడమే సమస్య అని ఓ మిత్రుడు తనకు సూచించారన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహణ కోసం కార్పొరేట్ కంపెనీలను సంప్రదించగా భారీ స్పందన లభించిందన్నారు. ఆయా పాఠశాలలన్నిటిని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని కార్పొరేట్ కంపెనీలు 15 రోజుల వ్యవధిలోనే హామీ ఇవ్వడం గమనార్హం అని తెలిపారు.

## ఆంగ్లం సిగ్గుచేటు కాదు

- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఆంగ్లంలో మాట్లాడడాన్ని భవిష్యత్‌లో సిగ్గుచేటుగా భావిస్తారని హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై విపక్షనేత రాహుల్ గాంధీ సహా పలువురు విరుచుకుపడ్డారు. ఇంగ్లీషు భాష ఆటంకం కాదని.. అదొక వంతెన, మన చేతిలో ఆయుధం లాంటిదని అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రతి చిన్నారిని సమాన హక్కులు కల్పించిందేకు బిజెపి, ఆర్ఎస్ఎస్ బద్ధ వ్యతిరేకులని రాహుల్ మండిపడ్డారు. పేదల సాధికారతను ఒప్పుకోరని, అదే జరిగితే వాళ్లు ప్రశ్నిస్తారని వాళ్ల భయమని దుయ్యబట్టారు. అలాంటప్పుడు బిజెపి మంత్రులు, వాళ్ల పిల్లలు ఇంగ్లాండ్ వెళ్లి గొప్ప గొప్ప యూనివర్శిటీల్లో ఆంగ్లం నేర్చుకుని వస్తున్నారని ప్రశ్నించారు. ఇంగ్లీషు అనేది ఒక ఆయుధం లాంటిదని, ఆ భాషను నేర్చుకుంటే ప్రపంచంలో ఎక్కడికైనా అమెరికా, జపాన్ తదితర దేశాలకు వెళ్లి రాగలమన్నారు. ప్రపంచంలో ఏ కంపెనీలోనైనా ఉపాధి పొందవచ్చునన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ నేతలు ఇంగ్లీషు వద్దు హిందీ మాత్రమే నేర్చుకోవాలని గతంలో చేసిన వ్యాఖ్యల వీడియోను ఈ సందర్భంగా రాహుల్ విడుదల చేశారు. పేదలు ఆంగం నేర్చుకోవద్దనే పిలుపుల వెనక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. 'వాళ్లు గొప్ప ఉద్యోగాలు చేయొద్దు, బోర్డు రూమ్‌ల్లోకి ప్రవేశించొద్దు, కోట్లాది రూపాయాలు సంపాదించొద్దు. దళితుల పిల్లలు దళిత హాస్టళ్లకే పరిమితం కావాలి. ఇలాంటి కుట్రలతో మీకు తలుపులు మూసేస్తున్నారు. అందుకే ప్రతి ఒక్కరు ఇంగ్లీషును అభ్యసించి దాన్ని ఆయుధంగా వాడుకోవాలి. అది మిమ్మల్ని ఎక్కడికైనా తీసుకెళ్తుంది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఆంగ్లంపై అమిత్ షా దుర్మార్గ పూరితంగా మాట్లాడారని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ మండిపడ్డారు. కోట్లాది మంది భారతీయులు ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చని, అది రాజ్యాంగం మనకు కల్పిస్తున్న హక్కు అన్నారు. సర్దార్ పటేల్ అభిప్రాయంతో అమిత్ షా విభేదిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు.

## 23 నుంచి రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం ఆన్ లైన్ దరఖాస్తులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కాలరీస్ సామాజిక బాధ్యతతో చేపట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 23వ తేదీ నుంచి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల విడుదలై సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన సింగరేణి కార్మికుల పిల్లలకు కూడా రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రతిబంధకాలను తొలగించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సూచనతో సింగరేణి సామాజిక బాధ్యత నిధులతో గత ఏడాది ప్రారంభించిన ఈ పథకం మంచి ఫలితాన్ని ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది 140 మంది ప్రిలిమ్స్ పాసైన వారికి సాయం అందించగా 20 మంది మెయిన్స్ లోనూ ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి మరో లక్ష రూపాయల సాయం కూడా అందించామని, వారిలో ఏడుగురు సివిల్స్ లో సత్తా చాటారని వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో ఈ ఏడాది కూడా మరింత మందికి ప్రోత్సాహం అందించేందుకు దీన్ని కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు సింగరేణి వెబ్ సైట్ www.scclmines.com ను సందర్శించి ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సివిల్స్ మెయిన్స్ పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు ఇది ఒక గొప్ప అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆయేషా మీరా హత్య కేసులో ముగిసిన సీబీఐ దర్యాప్తు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

18 ఏళ్ల క్రితం దారుణ హత్యకు గురైన ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు రీ ఓపెన్ చేసి దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ హైకోర్టుకు తన తుది నివేదికను సీల్డ్ కవర్‌లో అందచేసింది. ఈ కేసుపై తదుపరి విచారణను కోర్టు ఈనెల 26కు వాయిదా వేసింది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఈ ఘటనలో సీబీఐ అందజేసిన నివేదికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఆయేషా మీరా హత్య జరిగిన 2007 నాటి నుంచి ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. ఆయేషా మీరా హత్య కేసు చూస్తే 2007 డిసెంబర్ 27న విజయవాడ దగ్గర ఇబ్రహీంపట్నంలోని శ్రీ దుర్గ లేడీస్ హాస్టల్లో17 ఏళ్ల బీ.ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా బాత్‌రూమ్‌లో దారుణంగా అత్యాచారానికి గురై హత్యకు గురైంది.


## ఎల్‌బి స్టేడియంలో యోగా కార్యక్రమాలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహానగరంలోని ఎల్‌బి స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 సందర్భంగా కౌంట్ డౌన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఎంపి ఈటెల రాజేందర్, నటి ఖుష్బు, సినీ నటులు మినాక్షీ చౌదరి, సాయి దుర్గా తేజ్, తేజా సజ్జ, తదితరలు పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నగర ప్రజలు పాల్గొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## సీఎం రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై ముగిసిన విచారణ



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

గచ్చిబౌలిలో 2016లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును రద్దు చేయాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. గోపన్‌పల్లిలో సర్వే నం.127లోని 31 ఎకరాల భూవివాదంలో ఎస్సీ మ్యూచవల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, రేవంత్ సోదరుడు ఎ. కొండల్‌రెడ్డి, ఎ. లక్ష్మయ్యల మధ్య వివాదం నడుస్తోంది. అప్పట్లో ఎంపీగా ఉన్న రేవంత్ సొసైటీ స్థలంలో అక్రమంగా చొరబడేందుకు ప్రోత్సహించారని, అడ్డుకున్న తనపై కుల దూషణలకు పాల్పడ్డారని ఎన్. పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు 2016లో కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలంటూ రేవంత్ 2020లో పిటిషన్ దాఖలు చేశారు. కేసు నేపథ్యంలో రేవంత్ తరపు న్యాయవాది, "ఘటనా స్థలంలో రేవంత్ లేకున్నా, రాజకీయ కక్షసాధింపు కారణంగా కేసు నమోదు చేశారు" అని వాదించారు. ఇదే సందర్భంలో 2014లో పెద్దిరాజు చందానగర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన కేసు సరైన ఆధారాలు లేక పక్కా తేల్చలేక కోర్టు కొట్టివేసిందని తెలిపారు. ప్రస్తుత కేసులో కూడా 8 మంది సాక్షుల వాంగ్మూలంలో రేవంత్ ఘటనా స్థలంలో లేరని వెల్లడైందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు కోర్టుకు తెలియజేశారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్‌లో ఉంచింది.

## బనకచర్ల అసలు విషయం బయటపడింది

- మాజీ మంత్రి హరీశ్ రావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలతో బనకచర్ల అసలు బాగోతం వెలుగులోకి వచ్చిందని ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో ముందుగానే రహస్య ఒప్పందం కుదుర్చుకుని, గోదావరి, కృష్ణా నదుల జలాల్లో తెలంగాణకు కేవలం 1500 టీఎంసీలు ఇస్తే సరిపోతుందని చెప్పడం ద్వారా రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలకు తీరని ద్రోహం తలపెట్టారని ఆయన మండిపడ్డారు. కేబినెట్ సమావేశం నిర్వహించడం, చంద్రబాబుతో చర్చలు జరపాలనే ప్రతిపాదనలు కూడా ఈ ముందస్తు ఫిక్సింగ్‌లో భాగమేనని స్పష్టమవుతోందని అన్నారు. గోదావరి జలాల్లో తెలంగాణకు ఇప్పటికే ఉన్న ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోల) ప్రకారం 968 టీఎంసీల హక్కు ఉందని, సముద్రంలో వృథాగా కలిసిపోతున్న 3000 టీఎంసీల నీటిలో అదనంగా 1950 టీఎంసీలు కేటాయించాలని గతంలో కేసీఆర్ డిమాండ్ చేశారని హరీశ్ రావు గుర్తుచేశారు.

## భర్త హత్య కేసులో భార్యతో పాటు మరో ఇద్దరికి జీవిత ఖైదు..

**-ఎస్పీ మహేష్ బీ. గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భర్త హత్యకు కారణమైన భార్య తో పాటుగా మరో ఇద్దరు నిందుతులకు జీవిత ఖైదు,ఒక్కక్కరికి 2000 రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి నీరజ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ మహేష్ బీ. గితే శుక్రవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఎస్పీ మహేష్ బీ. గితే తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన దరంసోత్ శంకర్ నాయక్ కి ఇద్దరు భార్యలు మొదటి భార్య దరంసోత్ సరోజకు పిల్లలు పుట్టడం లేదని రాజవ్వ అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుర్లు ఒక కుమారుడు జన్మించారు. అప్పటినుండి మొదటి భార్య అయిన దరంసోత్ సరోజ వారిపై పగ పెంచుకొని గొడవలు పడుతూ ఉండేది. వారికున్న ఆస్తి అంతా రెండవ భార్య మరియు వారి సంతానానికి రాసిస్తాడనే భయంతో తన భర్త శంకర్ నాయక్‌కు గత 2020 సంవత్సరం నవంబర్ 11 తేది శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె తమ్ముడైన బానోతు శ్రీనివాస్, చెల్లెలు తేజావత్ లక్ష్మిలతో కలిసి బాగా తాగించి రోకలిబండతో కొట్టి ముగ్గురు కలిసి చంపినారు. రెండో భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకు అప్పటి సిరిసిల్ల రూరల్ సిఐ సర్వర్ కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ కు పంపించరని,తరువాత సిఐ ఉపేందర్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగిందని అన్నారు.కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్, రాజేందర్,సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్‌లు కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించాగా, పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితులైన ఏ 1- దరంసోత్ సరోజ, ఏ 2- బానోతు శ్రీనివాసు, ఏ 3- తేజావత్ లక్ష్మి అను ముగ్గురికి జీవిత ఖైదీతో పాటు ఒక్కొక్కరికి 2000 రూపాయల జరిమానా విధించడం జరిగిందని అన్నారు. నిందితులకి శిక్ష పడటంలో కృషి చేసిన అప్పటి విచారణ అధికారులు సర్వర్, ఉపేందర్, ప్రస్తుత సిఐ మొగిలి, ఎస్ఐ గణేష్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్,కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు , కోర్టు కానిస్టేబుల్ దేవేందర్, రాజేందర్,సి ఎం ఎస్ కానిస్టేబుల్ నవీన్ లను ఎస్పీ అభినందించారు.

## మహిళలకు,చిన్నారులకు అండగా భరోసా కేంద్రాలు

**-బాధితులకు తక్షణమే సూచనలు , సలహాలు సహాయం అందించాలి.**

**- ఎస్పీ మహేష్ బి. గితే**


**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



లైంగికదాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్‌కు వచ్చే వరకూ, పరిహారం ఇప్పించేవరకూ "భరోసా సెంటర్" అండగా నిలుస్తుందని ఎస్పీమహేష్ బి. గితే అన్నారు.శుక్రవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని శ్రీనగర్ కాలనిలో ఉన్న భరోసా కేంద్రాన్ని ఎస్పీ ఎస్పీమహేష్ బి. గితే సందర్శించి, లైంగిక,భౌతిక దాడులకు గురైన బాధితులకు భరోసా సెంటర్లో కల్పించే న్యాయ సలహాలు,సైకలాజికల్ కౌన్సెలింగ్, వైద్య పరంగా తీసుకుంటున్న చర్యలు,మహిళల వేధింపులపై నమోదు అవుతున్న కేసుల వివరాలు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లోని బాధిత మహిళలను అక్కున చేర్చుకుని వారికి వైద్యుడు, సైకాలజిస్టు, న్యాయాధికారి, పోలీసులు న్యాయ సహాయం చేయడం, ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించడం వంటి సేవలతో బాధితులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో 'భరోసా' కేంద్రం పని చేస్తుందని అన్నారు. బాధితులు రాగానే ఎవరి పరిధిలో వారు పనిచేస్తూ సత్వర న్యాయానికి కృషి చేస్తారనిఅన్నారు. లైంగిక దాడులకు గురైనా బాధితులకు భరోసా కల్పించడంతో పాటు వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. తక్షణమే బాధితులకు సూచనలు, సలహాలు అందించాలని అధికారులను,సిబ్బందిని ఆదేశించారు.భరోసా సెంటర్ సేవల గురించి జిల్లాలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించలని భరోసా సెంటర్ సిబ్బందికి సూచించారు.ఇక్కడ డిసిర్బీ సిఐ నాగేశ్వరరావు, భరోసా కేంద్రం సిబ్బంది ఉన్నారు.

## వేములవాడలో పెద్దమ్మ-దుర్గమ్మ బోనాల పండుగ ఉత్సవాలు



**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణ ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న బోనాల పండగ మహెూత్సవంలో భాగంగా "పెద్దమ్మ-దుర్గమ్మ" అమ్మవార్లను బీఆర్ఎస్ నాయకులుదర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఇక్కడ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి,ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బైరి సతీష్,మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థం రాజు, మాజీ కౌన్సిలర్లు మారం కుమార్,నిమ్మ శెట్టి విజయ్,నరాల శేఖర్, సిరిగిరీ చందు, జోగిని శంకర్,కొండ కనుకయ్య, కందుల క్రాంతి, మరియు విజయ్ యాదవ్ గుడిసె దేవరాజు,బాబు, పిల్లి శ్రీకాంత్,గొట్టం దేవయ్య,రాజు,సిద్దు,తదితరులు పాల్గొన్నారు

## విస్తృతంగా "స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్" తనిఖీలు..




**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించే లక్ష్యంతో విస్తృతంగా "స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్" తనిఖీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపీఎస్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రతి శుక్రవారం సాయంత్రం 06 గంటల నుండి 08 గంటల వరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడతాయి. మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణం అయితే వారిపై కఠిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పీ అన్నారు. తరచు డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేయాలని సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

తాగి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, వాటి వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు చితికిపోయే అంశాలపై పోలీస్ శాఖ వారు కౌన్సెలింగ్ ద్వారా వివరిస్తారని ఎస్పీ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపరచడం జరుగుతుంది. మద్యం సేవించిన మోతాదును బట్టి మొదటిసారి లేదా రెండవసారి పట్టుబడిన వారికి తప్పనిసరిగా శిక్షలు విధించబడతాయని ఆయన వెల్లడించారు. ట్రాఫిక్ నియంత్రణపైన, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపైన కఠినంగా వ్యవహరించడమే కాకుండా వారికి నిరంతరం కౌన్సిలింగ్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. వాహనదారులు,రోడ్డు నియమాలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

## రాజన్నసేవలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి..



**బలగం టీవీ, వేములవాడ**

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి శుక్రవారం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆయన ఆలయానికి విచ్చేశారు. ఆలయానికి చేరుకున్న శివసేన రెడ్డికి అర్చకులు స్వస్తి మంత్రాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం, కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు ఆయనకు వేదోక్త ఆశీర్వాదం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ శివసేన రెడ్డికి శేషవస్త్రం కప్పి, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం, ఆలయ ఈఓ రాధాభాయ్, చైర్మన్ గెస్ట్ హౌస్‌లో శివసేన రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఆషాడ బోనాలను వైభవంగా నిర్వహించాలి



**మాజీమంత్రి తలసాని శ్రీనివాస్**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే ఆషాడ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని మాజీమంత్రి, సనత్ నగర్ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. పాతబస్తీలోని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ నూతన చైర్మన్ గా నియమితులైన గోపిశెట్టి రాఘవేందర్ పాటు వివిధ ఆలయాల కమిటీ చైర్మన్ లు శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రపంచ దేశాలలో ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, వాటిలో ఆషాడ మాసంలో నిర్వహించే బోనాలు ఒకటని పేర్కొన్నారు. సుమారు నెల రోజులపాటు బోనాల ఉత్సవాలతో నగరం మొత్తం సందడిగా ఉంటుందని గుర్తు చేశారు. లక్షలాదిగా వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో ఉప్పుగూడ మహంకాళి ఆలయ చైర్మన్ మధుగౌడ్, బంగారు మైసమ్మ ఆలయ చైర్మన్ మధుసూదన్ యాదవ్, సభ్యులు భవాని శంకర్, గుర్నాథ రెడ్డి, ఆనంద్, శంకర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి నీతా అంబానీ భారీ విరాళం



**బలగం టీవి, హైదరాబాద్**

నగరంలో ప్రసిద్ధి చెందిన బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ భార్య నీతా అంబానీ భారీ విరాళం అందజేశారు. ఎల్లమ్మ గుడికి కోటి రూపాయల విరాళం అందించారు నీతా అంబానీ. నేరుగా టెంపుల్ బ్యాంక్ ఖాతాకు విరాళాన్ని ట్రాన్స్‌ఫర్ చేశారు. కాగా, ముఖ్యంగా నగరంలో ఉప్పల్ స్టేడియం లో ముంబై ఇండియన్స్ ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నా సమయంలో నీతా అంబానీ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా ఈ ఏడాది ఏప్రిల్ 23న నీతా అంబానీ తల్లి పూర్ణిమ దలాల్, సోదరి మమతా దలాల్తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ సమయంలో వారు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) కృష్ణ వారికి ఆలయ ప్రాముఖ్యతను, విశిష్టతను వివరించారు. దేవస్థానం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించాలని ఆయన వారిని కోరారు. అప్పటి ఈవో విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన నీతా ఇప్పుడు కోటి రూపాయలను విరాళంగా అందించారు. బుధవారం రోజున దేవస్థానం బ్యాంక్ ఖాతాలో జమ అయింది. ఈ విరాళం సొమ్ము మొత్తనాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి.. దానిపై వచ్చే వడ్డీతో భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తామన్న ప్రస్తుత ఈఓ మహేందర్‌గౌడ్ చెప్పారు.

# క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**-బనకచర్ల పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదే**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**




రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు పెద్ద పీట వేస్తున్నారని,అందులో భాగంగా రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు..అనంతరం వేములవాడ పట్టణంలో మినీ స్టేడియంను పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల శారీరక ధృఢత్వం లభిస్తుందనీ తెలిపారు...మన ప్రాంతంలో అనేక మంది క్రీడాకారులకు నిలయంగా మారిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు పెద్దపీటవేస్తోందని అన్నారు.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం, చందుర్తి మండలం మూడపల్లి వద్ద మినీ స్టేడియం నిర్మాణం, సిరిసిల్ల పట్టణంలో మినీ స్టేడియంలో నిర్మాణం కోసం స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు..ఎల్లపుడూ క్రీడాకారులకు తన వంతు సహాయ సహాకారాలు ఉంటాయని,రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డి పోటీలు జిల్లా పరిధిలో తన వంతు ప్రోత్సాహకం ఉంటుందన్నారు... .క్రీడాకారులు జీవితంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వాటిని ఎదుర్కొనే ధైర్యం ఎక్కువగా ఉంటుందన్నారు.. గ్రామీణ ప్రాంతాల్లోనీ క్రీడాకారులను వెలికి తీయడానికి సీఎం కప్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు.బనకచర్ల పాపం బీ ఆర్ఎస్ ప్రభుత్వానిదే అని అన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోదావరి జలాల వాటా విషయంలో అడ్డుకున్నది తామే అని, అబద్దాలు ఆడడంలో హరీష్ రావు దిట్ట అని,ప్రజలను తికమక పెడుతున్నారని, వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బనకచర్ల పాపం ఆనాటి కేసీఆరేదే అని 2016 సంవత్సరంలో కేంద్రంలో అపెక్స్ కమిటీ సమావేశానికి హాజరైంది కేసీఆర్, హరీష్ రావులే అని అన్నారు.మాజీ సిఎం కేసీఆర్ రాయలసీమను రతనాలసీమగా మారుస్తామని అన్నది అబద్ధమా అని ప్రశ్నించారు. కేసీఆర్, జగన్ మోహన్ రెడ్డి లు గోదావరి జిల్లాల విషయంపై నాలుగు సార్లు సమావేశం ఏర్పాటు చేసి గోదావరి జలాలను తీసుకెళ్లాలని చెప్పింది వాస్తవం కదా అన్నారు... 968 టీఎంసీలు గోదావరి జలాలు మా వాటా మాకు రావాలని,కాళేశ్వరం ను కేవలం ఎటిఎం గా వాడుకొని, కాళేశ్వరం తో వారి కుటుంబం బాగుపడిందనీ,కాళేశ్వరం ప్రాజెక్టు చుక్క నీరు వాడకుండానే దేశంలో అత్యధికంగా మన రాష్ట్రంలో మంచి పంటలు పండాయన్నారు. ఆంధ్రప్రదేశ్ కడుతున్న ప్రాజెక్ట్ లపై బీజేపీ వైఖరి పై కిషన రెడ్డి సమాధానం చెప్పాలనీ డిమాండ్ చేశారు..

శివ సేన రెడ్డి మాట్లాడుతూలి తన స్పోర్ట్స్ చైర్మన్గా నియామకం అయిన నాటి నుండి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గం లో మినీ స్టేడియాలో నిర్మాణం చేయవలసిందిగా కోరుతున్నారు.. వారి కృషి ఫలితంగా నేడు వేములవాడ నియోజకవర్గం లో రెండు స్టేడియాలు మంజూరు అయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం క్రీడాకారులను క్రీడలను ఏమాత్రం పట్టించుకోలేదు.. వారు 10 సంవత్సరాల కాలంలో క్రీడలకు 400 కోట్లు కేటాయిస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో 11 నెలల్లోనే 800 కోట్లు కేటాయించడం జరిగినట్టు తెలిపారు... రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో క్రీడా సామాగ్రిని అందుబాటులో ఉంచి గ్రామాల్లో నుంచి ఒలంపిక్ లో ఆడేలా మెరికల్ లాంటి క్రీడాకారులను తయారు చేస్తామని అన్నారు.



## పెద్దమ్మ తల్లి సేవలో ప్రభుత్వ విప్..

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణంలో మహాలక్ష్మీ వీధిలో ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస పాల్గొని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అమ్మవారి దీవెనలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు..

## పర్మిషన్ లేని స్కూల్స్ సిజ్ చేయాలి...

**బలగం టీవీ, వేములవాడ:**



జిల్లాలో పర్మిషన్ లేని స్కూల్ లను వెంటనే సీజ్ చేయాలని కేవీపీస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాలో మరియు వేములవాడ టౌన్లో పర్మిషన్ లేని స్కూల్స్ సిజ్ చేయాలి అని జిల్లా విద్యఅధికారికి కేవీపీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేవీపీస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు కొన్ని ఎలాంటి అనుమతులు లేకుండా ఈ సంవత్సరం పుట్టుకొస్తున్నాయని, విద్యార్థులకు సదుపాయాలు లేకుండా ఉన్నా వాటిని వెంటనే వాటినీ సిజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల విద్య వ్యాపారాన్ని అరికట్టాలని పాఠశాలలో బుక్స్ మరియు పిల్లల స్కూల్ డ్రెస్ అనేక రకాల వస్తువులు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీచేస్తు న్నారని అన్నారు. విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ స్కూల్స్ పర్మిషన్ రద్దు చేయాలని, మండలాల విద్యాధికారుల పర్యవేక్షణ పూర్తి స్థాయిలో ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాసం సుమన్, ప్రసాద్, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లలు దాటినా పెరిగిన ఊరిపై తరగని ప్రేమ..

**బలగం టీవీ, గంభీరావుపేట**



ఎల్లలు దాటినా పెరిగిన అమ్మమ్మ ఊరు మీద ప్రేమ తరగలేదు. విదేశాల్లో స్థిరపడినా పెరిగిన పల్లెను మరువ లేదు. మల్లారెడ్డిపేటలోని అమ్మమ్మ ఇంటి లో పెరిగి అత్యున్నత స్థాయికి ఎదిగి,రాణిస్తున్నా వీలు దొరికినప్పుడల్లా అమ్మమ్మ ఊరికి సేవ చేస్తున్నాడు సిరినేని శ్రీనివాస్ రెడ్డి . సిరినేని శ్రీనివాస్ రెడ్డి అమెరికాలో స్థిరపడ్డాడు. గంభీ రావుపేట మండలం మల్లారెడ్డిపేట లో పెరిగిన అమ్మమ్మ ఊరు పై మమకారంతో ఆలయ, గ్రామ అభివృద్ధికి తోడ్పడుతున్నాడు. అమ్మమ్మ తాతయ్య పెద్ది రాజవ్వ వెంకయ్యల జ్ఞాపకార్థం శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి 1,01116 రూపాయలను అందజేశారు. అంతేకాకుండా గతంలో గజ స్తంభాల నిర్మాణానికి 25 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామనికి వచ్చిన శ్రీధర్ రెడ్డి ని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎన్నారై శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పెరిగిన ఊరుకు ఎంత సేవ చేసినా తక్కువ నేనని,గ్రామస్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి ఇప్పటికే నాకు తోచినంత సహాయం చేసిన, అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తానని, గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తున్నాని, రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేసేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఇక్కడ ఆలయ కమిటీ చైర్మన్ మణిదీప్ రెడ్డి, కావ్య కమిటీ సభ్యులు రామచంద్రం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కోడెలను నిత్యం పర్యవేక్షిస్తూ సంరక్షించాలి..

- **జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి**
- **గోశాలలకు ఎంపిక చేసిన సిబ్బందికి అవగాహన సదస్సు..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన రెండు గోశాలలలోని కోడెలను నూతనంగా ఎంపిక చేసిన సిబ్బంది వాటిని నిత్యం పర్యవేక్షిస్తూ సంరక్షించాలని జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి సూచించారు. వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాల, ఆలయానికి సమీపంలోని కట్టకింద గోశాలలో పనిచేసేందుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారిలో నుంచి పలువురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ గురువారం అవగాహన కల్పించారు.

అనంతరం ఆయా గోశాలలో నియామకమైన సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కోడెలు, ఆవుల సంరక్షణపై వివరించారు. ప్రతి రోజు జీవాలకు పచ్చి గడ్డి, ఎండు గడ్డి, దాణా మూడు సార్లు ఇవ్వాల్సి ఉంటుందని, వాటికి నిత్యం పరిశుభ్రమైన నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. జీవాలు ఉండే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వాటి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గోశాలలోని పశువైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. గోశాలలో పశు వైద్యాధికారి, సహాయకులు, అటెండర్ తదితరు అందుబాటులో ఉంటారని వెల్లడించారు గోశాలలోని జీవాలకు సీజనల్ గా అన్ని టీకాలు వేసేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతగా తమ విధులు నిర్వర్తించి జీవాలను సంరక్షించాలని స్పష్టం చేశారు.

# చేనేత జౌళి శాఖను బీవై నగర్ పాత కార్యాలయానికి మార్చాలి..

**- వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్**

**- చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యకు వినతి పత్రం**



**బలగం టీవీ, సిరిసిల్ల**

పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్, జిల్లా అధ్యక్షులు కోడం రమణ చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్య కి పవర్లూమ్ కార్మికుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్ మాట్లాడుతూ, టెక్స్టైల్ కార్మికులకు మరియు ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులకు ప్రభుత్వం నుండి రావలసిన 10 శాతం యార్న్ సబ్సిడీని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల కార్మికులకు కూడా అన్యాయం చేయకుండా యార్న్ సబ్సిడీని వర్తింపజేయాలని ఆయన అన్నారు. "వారు ఎంతో కష్టపడి భార్య పిల్లలను వదిలి ఇతర రాష్ట్రాల నుండి మన దగ్గరికి వచ్చి పనిచేసి బట్ట ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి అందిస్తే, ప్రభుత్వం వారి కష్టాన్ని కాజేయడం సరైన పద్ధతి కాదు. అందరి కార్మికులను సమానంగా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని రమేష్ అన్నారు. వారికి సబ్సిడీని అందించకపోతే పెద్ద ఎత్తున పని బంద్ పెట్టి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా, చేనేత జౌళి శాఖను కలెక్టర్ కార్యాలయం నుండి సిరిసిల్లలోని బీవై నగర్లోని పాత కార్యాలయానికి మార్చాలని అన్నారు. కార్మికులకు ఏ చిన్న సమస్య వచ్చినా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఒకరోజు పని కోల్పోవడంతో పాటు విపరీతమైన ఖర్చులు కూడా అవుతున్నాయని అన్నారు. "కార్మికులకు అందుబాటులో ఉన్న కార్యాలయాన్ని తీసుకువెళ్లి కలెక్టర్ కార్యాలయంలో పెట్టడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 'ప్రజల వద్దకే పాలన' అంటున్న ప్రభుత్వం, ప్రజలకు అందుబాటులో ఉన్న కార్యాలయాలను తీసుకువెళ్లి ప్రజలను ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సమంజసం?" అని ఆయన ప్రశ్నించారు. వెంటనే కార్యాలయాన్ని మార్చాలని అన్నారు. బతుకమ్మ చీరలకు ఇచ్చిన మాదిరిగానే మహిళా శక్తి చీరలకు కూడా పవర్లూమ్ కార్మికులతో పాటు అనుబంధ రంగాల కార్మికులకు సబ్సిడీని కొనసాగించాలని అన్నారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తి చేసి కార్మికులకు అందించాలని, మహిళా శక్తి చీరలకు సంబంధించి నాణ్యమైన యార్న్ రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని, నాణ్యమైన యార్న్ సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

## అండర్-16 క్రికెటర్లకు 'సెకండ్ బోన్' టెస్టు..!

**బలగం టీవీ, హైదరాబాద్**




కేవలం క్రికెట్‌లోనే కాదు, ఇతర క్రీడల్లోనూ కొంతమంది క్రీడాకారుల వయసు గూర్చి అనుమానాలు, వివాదాలు సర్వసాధారణం తాజా ఐపీఎల్ 18వ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ అనే యువ క్రికెటర్‌పై వయసు పై కూడా తప్పుడు సమాచారం ఇచ్చినట్టు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా, అండర్-16 స్థాయిలో పాల్గొన్న కొన్ని ఆటగాళ్లను వచ్చే సీజన్‌లో వయస్సు మించిపోయిందని అనుమతించకపోవడం, ఈ అంశాన్ని మరింత ప్రాధాన్యం కలిగించాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ సమస్యల నివారణకు కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇకపై జూనియర్ క్రికెటర్లకు బీసీసీఐ కఠినమైన వైద్య పరీక్షలు నిర్వహించనుంది, తద్వారా వయస్సు విషయంలో ఎలాంటి దూరదృష్టి ఉండకుండా చూసేందుకు ఉద్దేశించింది. ఇకపై జూనియర్ ఇప్పటివరకూ 14-16 ఏళ్ల అబ్బాయిలకే బోన్ టెస్ట్ జరిపేవారు. ఈ పరీక్షలో నిర్ధారణ అయిన వయసుకు ఒక ఏడాదిని కలిపేవారు. అంటే.. ఉదహారణకు ఒక ఆటగాడి వయసు 14.3 సంవత్సరాలు అనుకోండి.. బీసీసీఐ ప్రకారం అతడికి 15.3 సంవత్సరాలు ఉన్నట్టుగా పరిగణిస్తారు. దీన్నే మ్యాథమేటికల్ ఏజ్ అని పిలుస్తారు.

జూనియర్ స్థాయిలో ఆటగాళ్ల ఎంపిక సమయంలో బోన్ టెస్ట్‌ను తప్పనిసరి చేసిన బీసీసీఐ, ఈ పరీక్షలతో వారి వయస్సును ఖచ్చితంగా అంచనా వేయవచ్చని నమ్ముతోంది. అయితే ఈ ఏడాది అండర్-16 జట్టులో ఉన్న ఆటగాళ్లు వచ్చే సీజన్ సమయానికి 17 ఏళ్ల వయస్సు దాటినందున వారు అర్హత కోల్పోతున్నారు. దీనివల్ల, ఇకపై అండర్-16 క్రికెటర్లకు రెండోసారి బోన్ టెస్ట్ నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఇది బాలురకు 16 ఏళ్లు వచ్చినపుడు, బాలికలకు 15 ఏళ్ల సమయంలో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఎముకల ఘనత, పరిమాణం వంటివి నిర్దేశిత ప్రమాణాలను మించి ఉంటే, అలాంటి ఆటగాళ్లను ఎంపికలో పక్కనపెట్టాలని బీసీసీఐ సెలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చే యోచనలో ఉంది. దీనివల్ల భవిష్యత్తులో వయసు మోసం (ఏజ్ ఫ్రాడ్) సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని బోర్డు ఆశిస్తోంది.

ప్రతి దేశవాళీ సీజన్ ప్రారంభానికి ముందు, బీసీసీఐ అన్ని రాష్ట్రాల్లోనూ భారీ ఎత్తున వయస్సు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తోంది. సాధారణంగా ప్రతి రాష్ట్రం నుంచి సుమారు 40-50 మంది బాలురకు, 20-25 మంది బాలికలకు ఎక్స్‌రే ఆధారిత బోన్ టెస్టులు నిర్వహిస్తారు. ఈ విధానం ద్వారా వయస్సు విషయంలో స్పష్టత రావడంతోపాటు, అసలు టాలెంట్‌కు అన్యాయం జరగకుండా ఉండే అవకాశముంది.




## హాకీ క్రీడాకారులకు నెలనెలా రూ. 25 వేలు..!

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత హాకీ క్రీడాకారులకు ప్రోత్సాహకంగా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బంపర్ బొనాంజా ఇవ్వనుంది. జాతీయ క్యాంప్‌నకు ఎంపికైన పురుష, మహిళా ప్లేయర్లకు ప్రతి నెల అదనంగా రూ.25వేలు చెల్లించనుంది. గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్స్ నెలవారీ సమావేశంలో హాకీ ఇండియా అభ్యర్థనను అంగీకరించిన మంత్రిత్వ శాఖ.. టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం కింద ఈ అలవెన్స్ అందజేస్తామని మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ స్కీమ్ ద్వారా మొత్తంగా 80 మంది (40 మంది పురుషులు, 40 మంది మహిళా క్రీడాకారులు) లబ్ది పొందనున్నారని హాకీ ఇండియా వెల్లడించింది. హాకీ ప్లేయర్లకు అదనపు భత్యం ఇవ్వాలని హాకీ ఇండియా పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్ సమావేశంలో చర్చ జరిగింది. ఆటగాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నెల నెలా రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. ఫామ్, ఫిట్‌నెస్.. ఈ రెండు అంశాల ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేస్తాం అని మంత్రి మాండవీయ వెల్లడించారు. అంతేకాదు ఈ సమావేశంలో కోర్ గ్రూప్ అథ్లెట్లకు ప్రతి నెల రూ.50 వేలు ఇవ్వాలని తీర్మానించామని ఆయన తెలిపారు. హాకీ ఆటగాళ్లకు నెలనెలా రూ.25 వేలు ఇవ్వడం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు ఖర్చు చేయనుంది.

## సూర్య- ఆర్‌జే బాలాజీ కొత్త సినిమా 'కరుప్పు'

**బలగం టీవీ, హైదరాబాద్**



కథానాయకుడు సూర్య 45వ చిత్రం ఇప్పటికే ప్రారంభమైంది. తాజాగా టైటిల్‌ను మేకర్స్ రివీల్ చేశారు. గతేడాదిలో పొల్లాచ్చి సమీపంలోని ఆనైమలై ప్రాంతంలో గల ప్రసిద్ధి చెందిన మాసానీ అమ్మన్ ఆలయంలో పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైంది. నటుడు ఆర్‌జే బాలాజీ ఈ మూవీకి దర్శకత్వం వహించనున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నటి త్రిష హీరోయిన్‌గా నటించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనున్నారు. ఈ సినిమాకు 'కరుప్పు' అనే టైటిల్‌ను ఫిక్స్‌చేశారు. ఈమేరకు అధికారికంగా ప్రకటన కూడా వచ్చేసింది. ఇదొక యాక్షన్ అడ్వెంచరస్ చిత్రమని తెలుస్తోంది. సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. ఈ ఏడాది ఆఖరులో ఈ సినిమా విడుదల కానుంది.

# తొలి రోజే సెంచరీల బాదుడు





- **యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సెంచరీలు**
- **తొలిరోజు ముగిసే సరికి భారత్ 3 వికెట్లకు 359 పరుగులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లండ్ పర్యటనలో తొలి టెస్టులో తొలి రోజు భారత జట్టు బ్యాటర్లు అదరగొట్టారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(127 నాటౌట్), యశస్వీ జైస్వాల్(101) సెంచరీలు బాధడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 3 వికెట్లకు 359 పరుగుల భారీ స్కోర్ చేసింది. రిషభ్ పంత్(102 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 65 నాటౌట్)తో కలిసి గిల్ క్రీజులో ఉన్నారు.

తొలి రోజు భారత బ్యాటర్లు దుమ్మురేపారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్(159 బంతుల్లో 16 ఫోర్లు, సిక్స్‌తో 101), శుభ్‌మన్ గిల్(175 బంతుల్లో 16 ఫోర్లు, సిక్స్‌తో 127 బ్యాటింగ్) సెంచరీలతో చెలరేగారు. కేఎల్ రాహుల్(78 బంతుల్లో 8 ఫోర్లతో 42) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అరంగేట్ర ప్లేయర్ సాయి సుదర్శన్(0) ఒక్కడే నిరాశపర్చాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ రెండు వికెట్లు తీయగా.. బ్రైడన్ కార్స్ ఓ వికెట్ పడగొట్టాడు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(101), కేఎల్ రాహుల్ (42) రాణించడంతో తొలి వికెట్‌కు 91 రన్స్ జోడించారు. తొలి సెషన్‌లో చెలరేగి ఆడిన ద్వయాన్ని బ్రాండన్ కర్సే విడదీశాడు. కేఎల్ రాహుల్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్(0) స్టోక్స్ వెనక్కి పంపాడు. దాంతో భారత్ 25.4 ఓవర్లలో 92/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో జైస్వాల్, గిల్ మరింత సాధికారికంగా బ్యాటింగ్ చేశారు.ఈ క్రమంలో జైస్వాల్ 96 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు గిల్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అనంతరం దూకుడుగా ఆడిన యశస్వి జైస్వాల్.. బౌండరీల మోత మోగించాడు. 144 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఇంగ్లండ్ గడ్డపై ఆడిన తొలి మ్యాచ్‌లోనే సెంచరీ బాదాడు. ఇది జైస్వాల్‌కు ఐదో టెస్ట్ సెంచరీ. దాంతో భారత్ 51 ఓవర్లలో 215/2 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది.మూడో సెషన్ ప్రారంభంలోనే జైస్వాల్‌ను స్టోక్స్ స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 129 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. రిషభ్ పంత్ కాస్త స్లోగా ఆడినా గిల్.. వేగంగా పరుగులు చేశాడు. ఈ క్రమంలో అతను 140 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ కాసేపటికే పంత్ కూడా 91 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 85 ఓవర్లలో టీమిండియా 3359 పరుగులతో తొలి రోజు ముగించింది.



## ఆడపులికి క్లీంకార పేరు..

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ బృందానికి ధన్యవాదాలు తెలిపింది. జూలో ఉన్న ఒక ఆడపులికి తన కూతురి పేరు క్లీంకార అని పెట్టిన సందర్భంగా తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రత్యేక పోస్ట్ పెట్టింది. ఒక సంవత్సరం క్రితం, అది కేవలం ఒక చిన్న పులి పిల్ల. కానీ ఈ రోజు అల్లరి చేసే ఆడపులిగా మారింది. నా కూతురు క్లీంకార పేరునే ఈ పులికి పెట్టడం చాలా సంతోషంగా ఉంది. ఈ విధంగా ప్రేమాభిమానాలు చూపించిన నెహ్రూ జూలాజికల్ పార్క్ బృందానికి ధన్యవాదాలు. వన్యప్రాణులు అడవిలోనే ఉంటాయని మనం నమ్ముతుంటాం. అదేవిధంగా జంతువులను సంరక్షించే ప్రయత్నాలను సైతం మద్దతు తెలుపుతుంటాం. అని ఉపాసన రాసుకొచ్చింది. అనంతరం ఇద్దరు క్లీంకారలతో కలిసి దిగిన ఫొటోను ఉపాసన పంచుకుంది.

నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని పులి పిల్లలను గురువారం ఉపాసన కొణిదెల దత్తత తీసుకుంది. తన కుమార్తె క్లీంకారతో కలిసి జూను సందర్శించిన ఆమె, అక్కడ వివిధ జంతువుల ఎన్‌క్లోజర్లను వీక్షించారు. అనంతరం జూపార్క్ డైరెక్టర్ డా. సునీల్ ఎస్. హిరేమత్‌ను కలిసి పులి పిల్లలను దత్తత తీసుకుంటున్నట్లు తెలియజేశారు. వాటి పోషణకు అవసరమైన నిధులను చెక్కు రూపంలో జూపార్క్ డైరెక్టర్‌కు అందజేశారు.

## అబ్బుర పరిచేలా నాగబంధం సెట్..

**బలగం టీవీ, హైదరాబాద్**




'పెద్దకాపు 1' సినిమాతో హీరోగా పరిచయమైన విరాట్ కర్ణ ప్రస్తుతం 'నాగబంధం' అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ మూవీకి అభిషేక్ నామా డైరెక్షన్ వహిస్తున్నాడు. అయితే ఈ మూవీలో 10 నిమిషాల సీన్ కోసం చిత్ర యూనిట్ నాగ బంధం సెట్‌ను వేసింది. దీని కోసం దాదాపు రూ.10 కోట్లు ఖర్చు చేసిందట. ఈ మూవీని కేరళ తిరువనం తపురంలోని అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో ఉన్న ఆరో గదికి సంబంధించిన నాగబంధం కాన్సెప్ట్‌తోనే రూపొందిస్తున్నారు.నభా నటేశ్, ఐశ్వర్యా మీనన్ కథానాయికలు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పణలో ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కేరళ అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌లో పాట చిత్రీకరణ జరుగుతోంది. 'ఈ పాటలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్య కళాకారులు పాల్గొంటున్నారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య పర్యవేక్షణలో ఈ పాటను చిత్రీకరిస్తున్నాం. ఈ ఒక్క ఎపిసోడ్‌కే రూ.10 కోట్లు బడ్జెట్ కేటాయించాం. ఈ అద్భుతమైన సీక్వెన్స్ ఎప్పటికీ గుర్తుండి పోయేలా ఉంటుంది' అని చిత్రయూనిట్ పేర్కొంది. జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బిఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా సౌందర్ రాజన్ ఎస్, సంగీతం అభే.

## శివ కార్తికేయన్ సాయం

**బలగం టీవీ, హైదరాబాద్**



శివ కార్తికేయన్ గురించిన ఓ ఆసక్తికర వార్త వెలుగులోకి వచ్చింది. చాలా కాలం క్రితం ఓ తమిళ రైతు నాయకుడికి ఇచ్చిన మాట మేరకు ఆయన ఇప్పటికీ సాయం చేస్తూ వస్తున్న విషయం బయటకి వచ్చింది. ఇటీవల దర్శకుడు ఐ.శరవణన్ ఈ విషయాలను బయట పెట్టారు. ఆయన మాట్లాడుతూ.. 'నా సోదరుడు నెల్ జయరామన్ మరణించినపుడు తన కుమారుడు శ్రీనివాసన్ విద్యా ఖర్చులను భరిస్తానని శివకార్తికేయన్ మాట ఇచ్చారు. ఆ మాట తప్పకుండా గత ఏడేళ్ళుగా విద్యా ఖర్చులను భరిస్తున్నార'ని తెలిపారు. శివకార్తికేయన్ గత ఏడేళ్ళుగా ఆ విద్యార్థి మొత్తం ఖర్చులను భరించడమే కాకుండా ప్రతి ఏటా పబ్లిక్ పరీక్షల సమయంలో ఫోన్ చేసి అన్ని విషయాలు అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు.